**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**

**ANDHRA PRADESH COMMITTEE**

H.No. 27-30-3, CPI(M) State Committee Office
Akulavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

ప్రచురణార్థం/ ప్రసారార్థం :

విజయవాడ,
తేదీ : 14 సెప్టెంబర్, 2017.

**శ్రీయుత నారా చంద్రబాబునాయుడు గారికి**
గౌరవ ముఖ్యమంత్రి,
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము,
అమరావతి.

**విషయం : పశ్చిమగోదావరి జిల్లాలోని పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలు తక్షణ పరిష్కారం కోరుతూ...**

ఆర్యా!

పోలవరం ప్రాజెక్టు పరిధిలోని కుకునూరు, వేలేరుపాడు మండలాల్లో సర్వే చేసిన కొన్ని గ్రామాలను ముంపు నుండి తొలగించింది. తాత్కాలికంగా వలస వెళ్లిన వారిని, ఇతర చోట్ల చదువుకుంటున్న విద్యార్థులను, వివాహమైన ఆడపిల్లలను, ఒంటరి మహిళలను ఆర్అండ్ఆర్ ప్యాకేజి నుండి తప్పించింది.

పట్టాలేని పోడు, ప్రభుత్వ భూములకు పరిహారం ఇవ్వడానికి నిరాకరిస్తోంది. కొంతమంది పట్టా భూములకు కూడా పరిహారం ఇవ్వలేదు. కుకునూరు సబ్కలెక్టర్ ఆఫీసులో నిర్వాసితుల సమస్యలు పరిష్కారానికి సబ్ కలెక్టర్ కార్యాలయంలో అందుబాటులో వుండాల్సి ఉన్నా ఉండడంలేదు. నిర్వాసితులంతా కలెక్టర్ ఆఫీసు, ఐటిడిఎల చుట్టూ తిరుగుతూ ఆగ్రహానికి గురవుతున్నారు. సెప్టెంబర్ 6న నిర్వాసితులు కె.ఆర్.పురం ఐటిడిఎ ఆఫీసు ముందు వేల మంది క్యూలో నిలబడి దరఖాస్తులు చేసుకోవాల్సి వచ్చింది. పోలవరం మండలంలోని ముంపు గ్రామాలకు కూడా ఏస్థాయి అధికార్లు రాకపోవడంతో నిర్వాసితులు జంగారెడ్డిగూడెం ఆర్.డి.ఓ, కొవ్వూరు స్పెషల్ డిప్యూటీ కార్యాలయానికి వెళ్ళవలసి వస్తోంది.

కుకునూరు మండలంలో 1.రాజీవ్ నగర్, 2.మెండువారి గూడెం, 3.పుల్లప్పగూడెం, 4.కమ్మరిగూడెం, 5. పాత దాచవరం, 6.బుడుగు, 7.నల్లకుంట, 8.వంజవారి గుంపు, 9.నెమిలిపేట, 10.రాయకుంట, 11.గుండు గూడెం, 12.గుండంబోరు, 13.రామన్నగూడెం, 14.పూటబోరు లాంటి గ్రామాలల్లో భూములు పోలవరం ప్రాజెక్టులో మునిగిపోతాయి. ఊళ్ళు కూడా జలమయమవుతాయని సర్వే చేసి ఆర్అండ్ఆర్ జాబితా కూడా ప్రకటించారు. అయితే ఇపుడు భూములే తప్ప ఊళ్ళు మునగవు. మీకు ఆర్అండ్ఆర్ ప్యాకేజి ఇవ్వలేం అని అధికార్లు అంటున్నారు. దీంతో ఈ గ్రామాల ప్రజలంతా ఆందోళనల్లో వున్నారు.

గతంలో వంశధార, ఇంకా కొన్ని ప్రాజెక్టుల్లో నిర్వాసితులతో సహా పెళ్ళి అయిన ఆడపిల్లలకు ఆర్అండ్ఆర్ ప్యాకేజి ఇచ్చారు. పోలవరం ప్రాజెక్టులోనే ముంపుకు గురవుతున్న చేగొండపల్లి, రామయ్యపేట, దేవరగొంది, సింగనపల్లి, మావుడిగొంది తదితర గ్రామాల్లో వివాహమైన ఆడపిల్లలకు ఆర్అండ్ఆర్ ప్యాకేజి ఇచ్చారు. అయితే నేడు వేలేరుపాడు, కుకునూరు మండలాల్లోని ముంపు గ్రామాలతోపాటు పోలవరం మండలంలోని మిగిలిన ముంపు గ్రామాల్లోనూ వివాహమైన ఆడపిల్లలకు ఆర్అండ్ఆర్ ప్యాకేజి ఇచ్చేది లేదంటున్నారు. కూనవరం, చింతూరు, ఎటపాక, విఆర్పురం ముంపు మండలాల్లో కూడా ఈ ప్యాకేజీ వర్తింప చేయరేమోనన్న అనుమానాలు గిరిజనుల్లో ప్రభలుతున్నాయి.

"త్రిప్పి చూడగలరు"

ఉపాధి కోసం తాత్కాలికంగా వలస వెళ్లిన, ఒంటరి మహిళలకు, బయట చదువుకుంటున్న విద్యార్థులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజి కుకునూరు, వేలేరుపాడు మండలాలు, పోలవరం మండలంలోని కొన్ని గ్రామాలలో తిరస్కరించినట్లు అధికారులు ప్రకటిస్తున్నారు. పెళ్ళి కాని, భర్తతో విడిపోయిన, భర్త చనిపోయిన ఒంటరి మహిళలందరికీ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజి ఇవ్వాలని జివోలో వుంది. 2013 భూ సేకరణ చట్టంలోనూ వుంది. కొంతమందికి ప్యాకేజీ ఇచ్చి మరి కొంతమందికి ప్రభుత్వం నిరాకరిస్తున్నట్లు గిరిజనుల్లో ఆందోళన వున్నది. ఊళ్లో పనిలేక కన్నవారినీ, కావాల్సినవారినీ, ఉన్నవారినీ వదిలిపెట్టి బతకడానికి ఎక్కడో పనికోసం వెళ్లిన వారిని ఊళ్లో లేనివారిగా ప్రకటించినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. చదువుకోసం వెళ్లిన విద్యార్థులను ప్యాకేజీ నుంచి తప్పించింది. రేషన్‌కార్డు, ఓటరు జాబితా, సామాజిక ఆర్థిక సర్వేలో ఉన్నా కొంత మంది నిర్వాసితులుగా జాబితాలో లేరు.

వేలేరుపాడు మండలంలో తూర్పుమెట్ట, పడమరమెట్ట, కొత్తూరు, గోలపల్లి, ఎడవల్లి, తదితర గ్రామాల భూములు సర్వే చేసినా అవార్డు ప్రకటించలేదు. భూమికి పరిహారం చెల్లించలేదు.

పట్టా లేదనే సాకుతో పోడు భూమికి, సాగు చేస్తున్న ప్రభుత్వ భూమికి పరిహారం ఇవ్వలేదు. అలాగే పట్టా భూమికి పట్టా వున్నా అనేకమందికి పరిహారం ఇవ్వలేదు. 2013 చట్టంలో రైతు స్వాధీనంలో ఉన్న పోడు, ప్రభుత్వ భూమికి పరిహారం ఇవ్వాలని స్పష్టంగా ఉంది. కానీ ఇవ్వడం లేదు.

అంతేకాక ఇంతవరకు మూడు గ్రామాలకు తప్ప వందల సంఖ్యలో వున్న ముంపు గ్రామాలకు ఇళ్ళు కట్టలేదు. కాబట్టే రోజురోజుకూ నిర్వాసితుల్లో భయంతోపాటు ఆందోళన పెరుగుతోంది.

2006-09 మధ్య నాటి ప్రభుత్వం లక్ష-లక్షా పాతికవేల రూపాయలు పరిహారం కొందరికి మాత్రమే చెల్లించింది. సేకరించిన భూమి ఐదేళ్లలోపు ప్రభుత్వం స్వాధీనం చేసుకోకపోతే ఆ భూమికి 2013 భూ సేకరణ చట్ట ప్రకారం పరిహారం ఇవ్వాలని ఉంది. దీనిమీద ప్రభుత్వం వైఖరిని ప్రకటించాలి.

కుకునూరు, వేలేరుపాడు, పోలవరం మండలాల్లో భూమికి భూమి నేటికీ వేలాది మంది నిర్వాసితులకు అప్పగించలేదు. ఇచ్చిన భూమి సయితం సబ్ డివిజన్ చేయలేదు. వీరికి బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి మండలాల్లోని భూములు ఇస్తున్నారు. వీటిల్లో వందలాది ఎకరాలు స్థానిక గిరిజనులు సాగులో ఉన్నవి ఇస్తుండటంతో వివాదాలు తలెత్తుతున్నాయి.

చేగొండపల్లి, దేవరగొంది, రామయ్యపేట తదితర గ్రామాల్లోని పునరావాస కాలనీలలో, ప్రభుత్వం నిర్మించిన ఇళ్లు చిన్న వానకు కూడా చెమ్మదేలి కురుస్తున్నాయి. ఇళ్ల నిర్మాణానికి ప్రస్తుత ధరల్లో రూ.3 లక్షల 25 వేల వ్యయం అవుతోందని, దీన్ని కేంద్ర ప్రభుత్వం అంగీకరించక పోవడంతో మిగిలిన నిర్వాసితుల ఇళ్లను రూ.2 లక్షల 75 వేలతోనే నిర్మిస్తామని ఇరిగేషన్ సెక్రటరీ చెబుతున్నారు. ఇది మన సమస్య పరిష్కారానికి తోడ్పడదు.

18 ఏళ్ళకు ఒక్క రోజు తక్కువైనా ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీకి అర్హులు కాదని ప్రభుత్వం పేర్కొంది. మైనరు పిల్లలు కూడా నిర్వాసితులే. వారి పోషణకు, చదువుకు ప్రభుత్వం ఆర్థిక సహకారం ప్యాకేజీలో భాగంగా ఇవ్వాలని నిర్వాసితులు కోరుతున్నారు. ప్రభుత్వం ఈ విషయాన్ని పరిగణలోనికి తీసుకోవాలి.

నిర్వాసితుల సమస్యలు ఆలస్యం అయ్యేకొద్దీ మరింత క్లిష్టతరం అవుతాయి, అశాంతి ప్రబలుతుంది. కనుక ఈ సమస్యలన్నింటినీ ప్రభుత్వం వెంటనే నిర్వాసితుల సంఘాలతోనూ, బాధితులతోనూ సంప్రదింపులు జరపాలని కోరుతున్నాము. మేము పూర్తిగా సహకరిస్తామని మనవి చేస్తున్నాం.

**అభివందనములతో...**

**(వై. వెంకటేశ్వరరావు)**
రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

**(పెనుమల్లి మధు)**
రాష్ట్ర కార్యదర్శి